www.prajasakti.com
గురువారం 21 ఆగస్టు 2025
5
వైఎస్ఆర్

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ఆయా గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తిరుపాల్ నాయక్ హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం స్థానిక పులివెందుల రోడ్డులోని చిల్లర దుకాణాలను ఎస్ఐ తనిఖీలు చేపట్టారు. ఖాళీ ప్రదేశాలను, పాఠశాలల ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్లర దుకాణాల్లో గుట్కా, తంబాకు వంటివి విక్రయించరాదన్నారు. పాఠశాలల వద్ద ఆకతాయిలు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. మత్తుపదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసులను

త్వరితగతిన ఛేదించాలి

- వినాయక వేడుకలకు పటిష్ట భద్రత
- ఎస్పి ఇ.జి.అశోక్‌కుమార్

నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పి అశోక్‌కుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అత్యధిక ప్రాధాన్యతతో కేసులను ఛేదించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్పి ఇ.జి అశోక్ కుమార్ ఆదేశించారు. బుధవారం పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ మిస్సింగ్ కేసులకై ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. వినాయక చవితి పండుగ నేపథ్యంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్ కేసులను త్వరితగతన పరిష్కరించాలన్నారు. కళాశాలలు, పాఠశాలల వద్ద శక్తి టీముల ద్వారా ఈవ్ టీజింగ్ పై తగిన చర్యలు చేపట్టాలని, డ్రోన్ కెమెరా ద్వారా నిఘా ఉంచాలని, ఈవ్ టీజింగ్ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలైన క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, మట్కా జిల్లాలో ఎక్కడా లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ క్రైమ్, సోషల్ మీడియా కేసుల్లో ముద్దాయిలను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక పోలీస్ టీమ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్' కార్యక్రమం లో భాగంగా పాఠశాలలు, కళాశాలల సమీపంలో పొగాకు ఉత్పత్తులు, గంజాయి, మాదక ద్రవ్యాల విక్రయాలపై సమీప దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై నిరంతర నిఘా ఉంచడంతో పాటు కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్స్ నిర్వహించాలని పేర్కొన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలూ, పట్టణాల్లోని కాలనీలను సందర్శిస్తూ ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్.పి(పరిపాలన) కె.ప్రకాష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ , డిఎస్పిలు, జిల్లాలోని సిఐలు, కడప సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

నీట్‌లో 975వ ర్యాంకు సాధించిన శ్రావణి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గజ్జల ఆంజనేయరెడ్డి, గజల సుమిత్ర దంపతుల కుమార్తె గజ్జల శ్రావణి ఈనెల 19న విడుదలైన జాతీయ స్థాయి నీట్ మెడికల్ పీజీ ఫలితాల్లో 627 మార్కులతో 975 ర్యాంకు సాధించారు. ఈమె తండ్రి భాకరాపేటలోని 11 బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కాగా శ్రావణి పదవ తరగతి వరకు కేశవరెడ్డి పాఠశాల, తిరుపతిలో, ఇంటర్ చైతన్య సరస్వతి పాఠశాలలో చదివారు. ఎంబిబిఎస్ కర్నూల్ మెడికల్ కళాశాలలో పూర్తి చేసుకుని హైదరా బాదులోని డాక్టర్ భాటియా మెడికల్ కోచింగ్ సెంటర్‌లో మెడికల్ పీజీ పరీక్షలకు కోచింగ్ తీసుకున్నారు. మంచి మార్కులతో 975 వ ర్యాంకును జాతీయ స్థాయిలో సాధించారు.

90 రోజుల్లో అన్ని మండలాల్లో

సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్లు

- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప అర్బన్

పైలెట్ ప్రాజెక్టు అయిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్స్ 90 రోజుల్లోనే జిల్లాలోని అన్ని మండలాల్లో అమలులోకి రానున్నామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో యూనిక్‌గా ఏర్పాటు కానున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ భవన నిర్మాణాల ప్రణాళిక, డిజైన్ల గురించి జెసి అదితిసింగ్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విజయ్ ఆర్కిటెక్చర్ ఇంజినీరింగ్ వారు రూపొందించిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ భవనాల నిర్మాణాల డిజైన్లను పవర్ పాయింట్ ద్వారా కలెక్టర్ పరిశీలించారు. నూతనంగా రూపుదిద్దుకోనున్న స్మార్ట్ కిచెన్ షెడ్ నిర్మాణాలు అన్ని మండలాల్లో ఒకే డిజైన్‌తో ఉండాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఇప్పటికే కడప నగరంలో నిర్వహణలో ఉన్న స్మార్ట్ కిచెన్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని, అదే స్ఫూర్తితో జిల్లాలోని అన్ని మండలాల్లో స్మార్ట్ కిచెన్ షెడ్లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికను రూపొందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత శుచిగా, రుచికరంగా, తాజాగా విద్యార్థులకు అందించే లక్ష్యంగా ప్రతి మండలంలో ఒక ప్రధాన పాఠశాలలో సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ భవనాలను నిర్మిస్తున్నామన్నారు. ఈ షెడ్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించి 60 రోజుల్లో సివిల్ వర్క్ పూర్తి చేసి, మరో 15 రోజుల్లో అన్ని రకాల పరికారాలను ఏర్పాటు చేసి ట్రయిల్ రన్ నిర్వహించాలన్నారు. ఈ నిర్మాణ ప్రక్రియ మొత్తం 90 రోజుల్లోపే పూర్తి చేసి కిచెన్ షెడ్లను నిర్వహణలోకి తీసుకురావాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సిపిఒ హజరతయ్య, డిఇఒ షంషుద్దీన్, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, హౌసింగ్ పీడీ రాజారత్నం, ఎడిపి యంగ్ ప్రొఫెషనల్స్, ఎస్ఎస్ఎ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

బోధనకు దూరం చేయడానికే

పరీక్షా విధానంలో మార్పులు

- యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు

డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉపాధ్యాయులను బోధనకు దూరం చేసేందుకే పరీక్ష విధానంలో మార్పులు చేపట్టి, బుక్ లెట్ అసెస్మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టారని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు ఆరోపించారు. బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డిఇఒ షేక్.షంషుద్దీన్‌ను కలిసి ఉపాధ్యాయులను బోధ నేతర పనుల నుంచి పూర్తిగా మినహాయించాలని, ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షల విధానాన్ని పాత పద్ధతిలోనే నిర్వహించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం, శిక్షణా తరగతుల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేశారని, రోజూ ఏదో ఒక సమాచారం విద్యాశాఖ అత్యవసరమంటూ యాప్ లలో అప్లోడ్ చేయమంటున్నారని తెలిపారు. విద్యా కిట్లు పంపిణీ అప్లోడ్ చేయాలంటూ ఒత్తిడి సరేసరని, యాప్‌ల భారం తగ్గిస్తామని చెబుతూనే ఒకే యాప్‌లో అనేక సమాచారాలు పెట్టమంటున్నారని కిందిస్థాయి అధికారుల ఒత్తిడి తట్టుకోలేక పోతున్నామని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన ఫార్మేటివ్ అసెస్‌మెంట్ సిలబస్‌లో లేని ప్రశ్నలను ఇచ్చి విద్యార్థులను గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టడంతో పాటు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు పరీక్షల్లో రావనే అపవాదు వస్తుందదని చెప్పారు. ఒకటో తరగతి విద్యార్థులు పేరాగ్రాఫ్ చదివి ప్రశ్నలకు జవాబులు తెలియజేయమనడం వారి స్థాయిని దృష్టిలో ఉంచుకోకుండా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. పరీక్షలు విద్యార్థులు రాస్తున్నారా? ఉపాధ్యాయులు రాసున్నారా? అన్న ప్రశ్న నేడు పాఠశాలల్లో నెలకుని ఉందని చెప్పారు. పరీక్ష విధానం పాత పద్ధతిలోనే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, నాయకులు సుబ్బారావు, వీరనారాయణ, గోపీనాథ్, శివకుమార్ రాజు, శివశంకర్ పాల్గొన్నారు.

వారసత్వ సంపద పరిరక్షణ అందరి బాధ్యత

ఇంటాక్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్, కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి

బహుమతి పొందిన విద్యార్థులలో ఇంటాక్ సభ్యులు

ప్రజాశక్తి - కడప అర్బన్

మన చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఇంటాక్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్, కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని ఎస్వి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటాక్ ఆధ్వర్యంలో నేషనల్ హెరిటేజ్ క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యం నుంచే విద్యార్థులలో మన వారసత్వ సంపదను పరిరక్షించాలనే స్పృహ కల్పించేందుకు ఇంటాక్ ఆధ్వర్యంలో ఈ పోటీని నిర్వహిస్తున్నామన్నారు. నేటి మన జాతి సంపదను పరిరక్షించడం ద్వారా భావితరాలకు మనం మేలు చేసిన వారమవుతామన్నారు. క్యాంపు చైర్మన్, ఎస్వి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. వి. సుదర్శనరెడ్డి మాట్లాడుతూ వారసత్వ సంపదలే మన జవసత్వాలు అనే వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. వారసత్వ ప్రదేశాలను సందర్శించడం ద్వారా అక్కడి చరిత్ర, సంస్కృతిని అవగాహన చేసుకోవడంతో పాటు విజ్ఞానం పెంపొందించుకోవచ్చు అన్నారు. క్విజ్ పోటీలో వంద మంది విద్యార్థులు హాజరయ్యారు. సమన్వయకర్తలుగా డాక్టర్ వై. నాగేంద్ర, ప్రొఫెసర్ ఎన్. షరీఫ్, ప్రొఫెసర్ టి. శిల్ప వ్యవహరించారు. పోటీలో ఎల్. యశ్విత, జి.లోహిత్ (బాల వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్) ప్రథమ, అదితి ఆలియా, కె.చందన (నాగార్జున మోడల్ స్కూల్) ద్వితీయ, ఎస్.రెడ్డి లావణ్య, జి.నిహారిక (శ్రీ భాష్యం పబ్లిక్ స్కూల్) తృతీయ బహుమతులు పొందారు. అలాగే పోటీలో పాల్గొన్న అందరికీ సర్టిఫికెట్లు బహుకరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి, జోనల్ చైర్మన్ ఎ. వెంకటసుబ్బయ్య, సైకాలజిస్ట్ డాక్టర్ ఓ. వెంకటేశ్వర రెడ్డి, రొటేరియన్ తాజుద్దీన్, ఇంటాక్ సభ్యులు గౌరీ శంకర్, సంజీవరెడ్డి, బాల ఎల్లారెడ్డి, మంజులా రెడ్డి, రాణి, పార్వతి పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సాయిశ్రీ

డంపింగ్ యార్డ్ కోసం ఆర్‌డిఒ స్థల పరిశీలన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల డంపింగ్ యార్డ్ స్థలాన్ని బుధవారం జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయిశ్రీ పరిశీలించారు. మండలంలోని పెద్దనపాడు వెళ్లేదారిలో డంపింగ్ యార్డ్ గతంలో మంజూరై ఉండేది. పెద్దనపాడు గ్రామస్తులు నిరాకరించి కోర్టుకు వెళ్లారు. కోర్టు డంపింగ్ యార్డ్‌ను అక్కడే అనుమతులిచ్చింది. గ్రామస్తులు మళ్లీ అడ్డుకొనడంతో ఆర్‌డిఒ పరిశీలించారు. ఆ వివాదంలో ఉన్న ప్రదేశాన్ని, కడప రోడ్డులో జువారి రైల్వే బ్రిడ్జి సమీపంలో ఒక ప్రదేశాన్ని ఆమె పరిశీలించారు. డంపింగ్ యార్డ్‌ను ఎక్కడ ఏర్పాటు చేయాలనేది పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శోభన్‌బాబు, మున్సిపల్ కమిషనర్ శేషఫణి, టిపిఒ రమణారెడ్డి, మున్సిపల్, రెవెన్యూ శాఖల సర్వేయర్లు పాల్గొన్నారు.

అర్హులైన వికలాంగులు అప్పీలుకు వెళ్లవచ్చు

ప్రజాశక్తి - కడప అర్బన్

అర్హులైన వికలాంగులు పింఛను కోల్పోయి ఉంటే అప్పీలుకు వెళ్లవచ్చని డిఆర్‌డిఎ ఏపీడీ రాజ్యలక్ష్మి ఒక ప్రకటన తెలిపారు. మండలాల్లో అయితే ఎంపిడిఒను, మున్సిపాల్టీలో అయితే కమిషనర్‌ను సంప్రదించి తమ వినతి పత్రం అందజేయవచ్చన్నారు. అధికారులు అర్జీని పింఛను పోర్టల్‌లో అప్లోడ్ చేసి అప్పీలు ద్వారా తిరిగి వికలాంగత్వ పునః పరిశీలనకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. వికలాంగత్వ పునః పరిశీలన పరీక్ష చేయించడం కోసం షెడ్యూల్ చేసిన ప్రకారం అప్పీలు కోరిన వికలాంగత్వ పింఛనుదారులు వారికి కేటాయించిన తేదీన, నిర్దేశించిన ఆసుపత్రిలో హాజరు కావాలని నోటీసు జారీ చేస్తారని పేర్కొన్నారు. వివరాలకు గ్రామ/వార్డ్ సచివాలయ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మనోజ్ రెడ్డి వినాయక చవితి నిమజ్జనం ప్రదేశాలను బుధవారం పరిశీలించారు. ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగ అధిపతులతో కలిసి కృష్ణా సర్కిల్ మీదగా దేవుని కడప చెరువు, ఇర్కాన్ సర్కిల్, ఫాతిమా కళాశాల, బిల్డప్ దగ్గర కృష్ణ కాలువ నిమజ్జనం స్థలములను పరిశీలించారు. నిమజ్జనం ప్రదేశంలో పరిశుభ్రంగా ఉంచాలని, ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనం ప్రదేశంలో లైటింగ్ ఏర్పాటు చేయాలని, నీటి వసతి కల్పించాలని పేర్కొన్నారు. బారికేడ్లను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు.

సైకో తండ్రి నుంచి చిన్నారికి రక్షణ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్లలో సైకో తండ్రి నుంచి పోలీసులు చిన్నారికి రక్షణ కల్పించి, అనాథాశ్రమానికి తరలించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పట్టణంలోని శ్మశానంలో గుంతలు తీసుకుంటూ జీవనం సాగిస్తున్న హనుమంతుకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. భార్య కువైట్‌కు వెళ్లింది. అతను మద్యానికి బానిస అయ్యాడు. తాగి వచ్చి పిల్లలును కొడుతూ వేధిస్తుండడంతో గమనించిన ఎఎస్ఐ రాజారెడ్డి సిఐ విశ్వనాథ్‌రెడ్డికి తెలిపారు. సిఐ ఆదేశాల మేరకు చిన్నారి అంకాలమ్మను లేడీ కానిస్టేబుల్ జయంతి తిప్పలూరు ఎద్దుల పెద్ద శేషమ్మ అనాథ ఆశ్రమంలో చేర్పించారు.

'అమ్మ మనసు' కథల సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

సృష్టికి మూలమైన అమ్మ మనసును విశిష్టమైన పంథాలో కేతు పద్మమ్మ అద్భుతంగా ఆవిష్కరించారని వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో బుధవారం కడప సింగపూర్ సిటీలో ఆచార్య కేతు విశ్వనాథ్ రెడ్డి సతీమణి కేతు పద్మమ్మ రాసిన 'అమ్మ మనసు' కథల సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం కుటుంబం నడుపుకోవడంతోనే మహిళల జీవితాలు గడిచిపోతున్నాయని, అలాంటి పరిస్థితుల్లో రాయలసీమ నుంచి మహిళా కథకులు తయారు కావడం అభినందనీయమని పేర్కొన్నారు. తన జీవితంలో ఎదురైన అనేక సంఘటనలు పద్మమ్మ కథలుగా మలచడం చాలా సంతోషమన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ మాజీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రామము రెడ్డి ప్రసంగంలో కేతు విశ్వనాథ్ రెడ్డిఅడుగుజాడల్లో నడుస్తూ పద్మమ్మ కథలు రాయడం శుభ పరిణామన్నారు. విశిష్ట అతిథులుగా విచ్చేసిన ప్రసిద్ధ కథా రచయిత పాలగిరి విశ్వప్రసాద్ మాట్లాడుతూ అప్పట్లో కేతు విశ్వనాథ రెడ్డి ప్రసిద్ధ కథలకు ముడి సరుకు అందించింది పద్మమ్మ అని, ఆమె ఆయా కథలు చెప్పినప్పుడు ఆయన తాత్విక దృక్పదంతో కథలుగా మలిచారన్నారు. ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాష సంఘం మాజీ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ పద్మమ్మ తన భర్త కేతు రాసిన ప్రతి కథకు తొలి పాఠకురాలని, ఆ అనుభవాలన్నీ వృధా పోలేదని, అమ్మ మనసు కథలుగా రూపుదాల్చాయని చెప్పారు. కేతు విశ్వనాథరెడ్డి కుమారుడు శశికాంత్ రెడ్డి మాట్లాడుతూ అమ్మ కథలు రాస్తుందని తెలిసి మొదట ఆశ్చర్యమేసినా కథలు చదివిన తర్వాత తన చుట్టుపక్కల జరిగే సామాజిక పరిస్థితులను ఇంత చక్కగా అర్థం చేసుకుందా అనిపించిందన్నారు. డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్ రెడ్డి తన ప్రసంగం లో పద్మమ్మ తన ఆలోచనలను,అనుభవాలను సున్నితంగా మన ముందుంచిందన్నారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి పద్మ గారి కథలు నేటి సామాజిక జీవనానికి అద్దం పడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా రచయితల సంఘం వారు పద్మమ్మను ఘనంగా సన్మానించారు. పద్మమ్మ మాట్లాడుతూ కేతు విశ్వనాథ రెడ్డి సతీమణిగా ఆయన ఆలోచనలను దృష్టిలో పెట్టుకొని ఈ కథలు రాశానన్నారు. కార్యక్రమంలో కందుల లక్ష్మీదేవమ్మ, రమాదేవి, కరుణ,ఉమాదేవి పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఘనంగా మాజీ ఎమ్మెల్యే

రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

వైసిపి కడప జిల్లా అధ్యక్షులు, కమలాపురం మాజీ ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి జన్మదిన వేడుకలను కమలాపురం వైసిపి యూత్ నియోజకవర్గ అధ్యక్షులు గజ్జల ఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డికి శాలువా కప్పి, గజమాలు వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే చేత కేక్ కట్ చేయించారు. అనంతరం ఆయనకు స్వీట్ తినిపించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ నిస్వార్థ సేవకుడు, ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న రవీంద్రనాథరెడ్డి ఉన్న పదవులు పొందాలన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గుడా ప్రభాకర్ రెడ్డి, నాయకులు జనర్దన్ రెడ్డి, సిద్దు మూల వంక విశ్వనాథ రెడ్డి,శ్రీను వాసులు,ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు. **కడప :** కడప వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి నేతృత్వంలో కేక్ కట్ చేసి పులువురికి పంచారు.

చింతకొమ్మదిన్నె : రవీంద్రనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న గజ్జల ఈశ్వర్‌రెడ్డి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్వియూ రిటైర్డ్ ఆచార్యులు

కవిత్వం సమాజ హితం కావాలి

- ఎస్వియూ రిటైర్డ్ ఆచార్యులు డాక్టర్ మేడిపల్లి రవి కుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

కవిత్వం సమాజ హితం కావాలని ఎస్వియూ రిటైర్డ్ ఆచార్యులు డాక్టర్ మేడిపల్లి రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం బ్రౌన్ లైబ్రరీ సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో లోసారి సుధాకర్ రచించిన 'ఆయుధం లాంటి మనిషి' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లా కుమారస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వృత్తి రీత్యా ఎఎస్పిగా పనిచేస్తూ తన రచనా వ్యాసంగం కొనసాగించడం కవిత్వం పట్ల ఆయనకున్న మక్కువను తెలుపుతోందన్నారు. విశిష్ట అతిథిగా వైవీయూ ఆచార్య డాక్టర్ ఎన్. ఈశ్వర్ రెడ్డి సమాజంలో కనబడే అనేక అంశాలను కవి కళ్ళకు కట్టినట్లు తెలిపారని చెప్పారు. రచయిత లోసారి మాట్లాడుతూ తాను వృత్తి పరంగా, సమాజంలో అనుభవాత్మకంగా దగ్గరగా చూసిన అనేక అంశాలే తన రచనకు ప్రేరణ అని పేర్కొన్నారు. ఆత్మీయ అతిథి ప్రముఖ న్యాయవాది సంపత్ కుమార్, గౌరవ అతిథి సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగర మోహన్, ఇంటాక్ చిన్నప రెడ్డి, ఆర్జేయూపి డా.గునిశెట్టి శ్రీనివాసులు, వైవీయూ రాంప్రసాద రెడ్డి, బ్రౌన్ లైబ్రరీ డైరక్టర్ డాక్టర్ పార్వతీ మాట్లాడారు.

జెవిఒ చంద్రకిశోర్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా పశుసంవర్తకా శాఖ సి.కె. దిన్నె, సిద్దవటం మండలలాలలో పనిచేస్తున్న జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ (జెవిఒ)బి.చంద్రకిషోర్ రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. బుధవారం విజయవాడలో పశు సంవర్తక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సం దర్భంగా చంద్రకిశోర్ మాట్లాడుతూ ఈ అవార్డు తన భాద్యతలను మరింత పెంచిందని పేర్కొన్నారు. నిరంతరం శ్రమించి శాఖకు, అధికారులకు పేరు తెస్తానని చెప్పారు. ఆయనకు అవార్డు రావడంపట్ల పలువరు అభినందనలు తెలిపారు.

కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఆకస్మిక మృతి

ప్రజాశక్తి - కడప అర్బన్

శ్రీనివాసులు (ఫైల్)

నగరపాలక సంస్థలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న అన్నదానం శ్రీనివాసులు రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది దేవుని కడపలోని మృతిని స్వగృహానికి వచ్చి మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నగరపాలక సంస్థలో బిల్ కలెక్టర్‌గా చేరి ఉద్యోగోన్నతి పొందుతూ ప్రస్తుతం సూపరింటెండెంట్ కేడర్‌లో ఉన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తూ పలువురు అధికారుల మన్ననలు పొందారు. కొంతకాలంగా నోటి కేన్సర్‌తో తో బాధపడుతూ ఉన్నారు. రోజురోజుకూ ఆరోగ్యం క్షీణించడంతో అకస్మాత్తుగా మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో వారు కన్నీరు మున్నీరై విలపించారు. దేవుని కడపలో విషాదఛాయలు అలుముకున్నాయి.

టూటౌన్ సిఐగా జి.సుబ్బారావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

గతంలో కడప కమాండ్ కంట్రోల్, ప్రొద్దుటూరు 3 టౌన్ పోలీస్ స్టేషన్‌తో పాటు పలు ప్రాంతాల్లో సిఐగా పని చేసిన సుబ్బారావు. బుధవారం కడప టూ టౌన్ సిఐగా బాధ్యతలు చేపట్టారు. స్టేషన్ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా ఉంచుతామని పేర్కొన్నారు.

అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తాం

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని చెన్నూరు గ్రామానికి చెందిన శ్మశాన స్థలాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ మురళీకృష్ణ బుధవారం పరిశీలించారు ఈ సందర్భంగా దూదేకుల కుటుంబాల వారందరూ తమ సమస్యలు ఆయనకు విన్నవించారు. ఇక్కడ కొన్నేళ్ల నుంచి తమకు శ్మశానం ఉందని పేర్కొన్నారు. మాజీ మంత్రి వీరారెడ్డి బతికి ఉన్నప్పుడు ఎకరా స్థలాన్ని శ్మశానంగా ఇచ్చారని చెప్పారు. అధికారులు కూడా అంగీకరించారని ఆయన దృష్టికి తెచ్చారు. ఇప్పుడు కొంతమంది కబ్జాదారులు స్థలాన్ని ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. ఎవరైనా చనిపోతే శ్మశానం మృతదేహానికి దగ్గరగా పూడుస్తున్నారని వాపోయారు. గతంలో ఉన్న ఎకరా శ్మశాన స్థలాన్ని ఇప్పించాలని కోరారు. ఆయన స్పందించి అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల సర్వేయర్, దూదేకులు ఉన్నారు.

శ్మశాన స్థల పరిశీలనలో అధికారులు

తహశీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న వైసిపి నాయకులు

వర్షాలతో నష్టపోయిన రైతులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - ఖాజీపేట

ఇటీవల వర్షాలతో పలు పంటలు దెబ్బతిన్నాయని, క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తహశీల్దార్ రమణమ్మకు రైతుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అర్హత ఉన్నా అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాలో జమ కాలేదన్నారు. ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా జనరల్ సెక్రెటరీ రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, సర్పంచ్ భూమన సుబ్బరెడ్డి, దుంపలగట్టు సర్పంచ్ రెడ్యం కృష్ణారెడ్డి, రావులపల్లె ఎంపీటీసీ కనపర్తి సుబ్బారెడ్డి, ఏటూరు శివారెడ్డి, బి.కొత్తపల్లె జి.నాగిరెడ్డి, వైసిపి యువ నాయకులు రమణ పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్లు తొలగించడం హేయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మాట్లాడుతున్న రాచమల్లు శివప్రసాద్ రెడ్డి

వికలాంగుల పింఛన్లు తొలగించడం హేయమని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తెలిపారు. దొరసాని పల్లెలోని ఆయన నివాసంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ దివ్యాంగులకు గత ప్రభుత్వాలు సదరం సర్టిఫికేట్లు ఇచ్చి దాదాపు 2,3 దశాబ్దాలుగా ఫించన్‌లు పొందిన వారిని రీ వెరిఫికేషన్ చేయాలనడం అవివేకమన్నారు. గత 14 నెలల కూటమి పాలనలో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 1,123 పింఛన్లు, కడప జిల్లాలో 9,408 పింఛన్లు తొలగించారని విమర్శించారు. నూతన ఫించన్లు ఇవ్వకపోగా, 50 సంవత్సరాల పింఛన్ హామీ తుంగలో తొక్కి పింఛన్లు తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. వీరికి రానున్న 1న ఫించన్ ఇవ్వని పక్షంలో ప్రొద్దుటూరులో నిరాహార దీక్ష చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగులు పాల్గొన్నారు.

అర్హులైన వికలాంగులకు న్యాయం చేయాలి

రీ అసెస్మెంట్‌ను నిష్పక్షపాతంగా జరిపి అర్హులైన వికలాంగులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్ కోరారు. స్థానిక కార్యాలయం ఎదుట బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనర్హులైన దివ్యాంగుల పింఛన్లను ఏరి వేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా అర్హతగల ఎంతోమంది దివ్యాంగుల పింఛన్లు తొలగించి వారి పొట్ట గొట్టడం అన్యాయమన్నారు. అర్హత ఉన్న పెన్షన్లను తొలగించకుండా అధికారులు చూడాలన్నారు. కార్యక్రమంలో అల్తాఫ్ రామసుబ్బయ్య, హనుమంతు, ఆసిఫ్ పాల్గొన్నారు.

37 వికలత్వ పింఛన్లు తొలగింపు

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సామాజిక పింఛన్లలో మండల వ్యాప్తంగా అనర్హులైన 337 వికలత్వ పింఛన్లను తొలగించినట్లు బుధవారం ఎంపిడిఒ పరిపూర్ణ అరుంధతి తెలిపారు. ఎంపిడిఒ మాట్లాడుతూ వికలత్వ పింఛన్‌కు అర్హులై పింఛన్ తొలగిపోయిన వారు తిరిగి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. వివరాలకు ఆయా గ్రామ సచివాలయాల్లో పింఛన్ దారులు వేలిముద్రలు వేసి సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

పుట్టుకతోనే గుడ్డి.. పింఛను తొలగించారు

ప్రజాశక్తి - వేంపల్లె

అబ్దుల్ షుకుర్

వేంపల్లెకు చెందిన తాను పుట్టుకతోనే గుడ్డి వాడినని, 40 శాతం వికలత్వం ఉన్నట్లు వైద్యులు సర్టిఫికెట్ ఇచ్చారని అబ్దుల్ షుకుర్ అనే బాధితుడు తెలిపాడు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులు వద్ద అబ్దుల్ షుకుర్ వాపోయాడు. తనకు 17 ఏళ్ల నుండి పింఛన్ తీసుకుంటున్నట్లు తెలిపాడు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన రూ.75 పింఛన్ కూడా తాను తీసుకున్నానని తెలిపాడు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తనకు వికలాంగ పింఛన్‌కు అర్హత లేదని నోటీసు ఇచ్చిందని వాపోయాడు. తనకు ఎవరూ లేరని అధికారులు ఎదుట వాపోయాడు. పింఛన్ వచ్చేలా చూడాలని ఆయన వేడుకున్నాడు.

వాహనాల వేగ నియంత్రణకు చర్యలు తీసుకోండి

ఎర్రగుంట్ల : ఆర్‌టిపిపికి సంబంధించిన ఫ్లై యాష్ వాహనాల వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఏపీ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ సుబ్బిరెడ్డి కోరారు. ఆ మేరకు బుధవారం కలముల ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డికి వినతిపత్రమిచ్చారు. అనంతరం సుబ్బిరెడ్డి మాట్లాడుతూ ఆర్‌టిపిపిలో రోడ్లు ఇరుకుగా ఉన్నాయని, ప్రతిరోజు వందలాది వాహనాలు తిరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో ప్రమాదాలు అధికంగా జరుగు తున్నాయని వివరించారు. ఇటీవల టిప్పర్ బైక్‌లను ఢీకొనడంతో ఇద్దరు మహిళలు మరణించిన సంగతి తెలిసిందే. అధిక లోడు వేసుకుని మితిమీరిన వేగంతో వాహనాలు తిరుగుతున్నాయని అన్నారు. రోడ్డు పొడవునా ఫ్లై యాష్ కింద పడుతోందని, అది వాహనాలు తొక్కడం వలన దుమ్ము ఎగిరి గ్రామాలపై పడుతోందని వివరించారు. ఏపీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - వేముల

ఎస్ఐ ప్రవీణ్‌కుమార్

వినాయక చవితి పండుగ సందర్భంగా వేముల పోలీస్‌స్టేషన్ పరిధిలో వినాయక మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా అను మతులు పొందాలని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటుకు పోలీస్‌స్టేషన్లో దరఖాస్తు కాపీని సమర్పించాలన్నారు. ప్రధాన రోడ్లలో మండపాలను ఏర్పాటు చేయవద్దని, విద్యుత్ కనెక్షన్ సురక్షితంగా అమర్చాలని, అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని ఆయన కోరారు.

క్రైం కార్నర్

గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నవీన్ (ఫైల్‌ఫొటో)

ఈ నెల 18న రాత్రి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మంచాల నవీన్ (22) అనే యువకుడు మంగళవారం రాత్రి కర్నూలులో చికిత్స పొందుతూ మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక దళితవాడకు చెందిన నవీన్ జమ్మలమడుగు నుండి ప్రొద్దుటూరు వెళ్లే రహదారిలో బైపాస్ రహదారి పనులు జరిగే ప్రదేశంలో ఉన్న ఇనుప డ్రమ్ములు వర్షానికి కనపడక ప్రమాదానికి గురయ్యాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూల్‌కు రెఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చిన్న వయసులోనే నవీన్ మృతి చెందడంతో వీధిలో విషాదఛాయలు అలుముకున్నాయి. నవీన్ తండ్రి చెప్పులు కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇంటికి పెద్ద కొడుకు కావడం, చేతికి వచ్చిన కుమారుడు ఇలా దుర్మరణం చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి తమ్ముడు, చెల్లెలు ఉన్నారు.

విద్యను దూరం చేస్తున్న ప్రభుత్వం : ఎస్ఎఫ్ఐ

తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని మైదుకూరు తహశీల్దార్ రాజసింహకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎద్దు రాహుల్ మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి దాదాపు వందల మంది విద్యార్థులు మైదుకూరు పట్టణానికి చదువు అభ్యసించడానికి వస్తున్నారని, ఇంతవరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవటం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ హైస్కూల్‌లో సరైన తాగునీటి వసతి లేదన్నారు. పాఠశాలకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉర్దూ జూనియర్ కళాశాలలో రెగ్యులర్ ప్రిన్సిపల్ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.6,400 కోట్లు విడుదల చేయాలన్నారు. జీవో నెంబర్ 77ను రద్దు చేసి, పీజీ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు నెలకు రూ.3 వేలకు మెస్ బిల్లులు పెంచాలన్నారు. జిల్లాలో హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలన్నారు. ఎయిడెడ్ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని సూచించారు. అర్హులైన వారికి తల్లికి వందనం రూ.15,000 ఎలాంటి షరతులు లేకుండా ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ఉన్న విద్యార్థులందరికీ ఉచిత బస్సు పాస్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్, సుధీర్, తేజ పాల్గొన్నారు.

పోలీసుల విచారణకు హాజరైన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం పోలీసుల విచారణకు వైసిపి మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ఈనెల 12న పులివెందుల జడ్‌పిటిసి ఉపఎన్నికకు సంబంధించి పోలీసులు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని పులివెందులలో అరెస్టు చేశారు. కడపకు తరలిస్తున్న క్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పోలీసుల వాహనాన్ని అడ్డుకొని అవినాష్‌రెడ్డిని విడిపించుకుని, ఎమ్మెల్యే స్వగ్రామమైన నిడ్జికి పిలుచుకు వెళ్లారు. అనంతరం ఎంపీ అక్కడి నుంచి ర్యాలీగా ఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలి వద్దకు చేరుకున్నారు. కూడలిలో వైసిపి నాయకులు, కార్యకర్తలతో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసుల విధులకు అడ్డగించడం, అనుమతి లేకుండా ధర్నా నిర్వహించడం అంశాలపై పోలీసులు సుధీర్‌రెడ్డి, ఆయన అనుచరులపై కేసులు నమోదు చేశారు. ఈ విషయంలో మాజీ ఎమ్మెల్యేను పోలీస్‌స్టేషన్‌కు తరలించి 13న విచారించారు. అనంతరం 16వ తేదీ విచారణకు రావాల్సిందిగా పోలీసులు నోటీసులు ఇవ్వడం, అనారోగ్యం కారణంగా 20న హాజరవుతారని మాజీ ఎమ్మెల్యే గడువు తీసుకున్న క్రమంలో బుధవారం హాజరయ్యారు. సిఐ విశ్వనాథరెడ్డి స్టేషన్లో లేకపోవడంతో ఎస్ఐ నాగమురళి వద్ద మాజీ ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈనెల 25న హాజరవ్వాలని ఎస్ఐ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యేతోపాటు లాయర్ రాజేశ్వర్‌రెడ్డి, జడ్పిటిసి బాలయ్య, గంగా కృష్ణారెడ్డి, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

అవసరం మేరకు ఎరువులు వాడాలి

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

రైతులు అవసరం మేరకు మాత్రమే రసాయనిక ఎరువులను ఉపయోగించాలని ఎడిఎ కృష్ణమూర్తి సూచించారు. మండలంలోని ఆదిరెడ్డి పల్లె, ముదిరెడ్డిపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఎఒ బాలగంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకొని అవసరం మేరకు మాత్రమే రసాయన ఎరువులను ఉపయోగించాలన్నారు. యూరియాను అధికంగా వాడడంతో ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. వరి సాగులో కాలిబాటలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎఒ మాట్లాడుతూ ప్రధానమంత్రి పసల్ బీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల చివరి వరకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త ఫిరోజ్ హుస్సేన్, వెటర్నరీ సైంటిస్ట్ విజయనిర్మల, గ్రామ ఉద్యాన సహాయకురాలు ఎం.ఝాన్సీ లక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఖాజీపేట : రైతులు యూరియాను అధిక మోతాదులో వినియోగించడం వల్ల భూసారం నశిస్తుందని, విడతలవారీగా ఉపయోగించడం శ్రేయస్కరమని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని బి.కొత్తపల్లెలో పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎఒ నాగార్జున రైతులకు సూచనలు చేశారు. కాంప్లెక్స్ ఎరువులను వరి పై పాటుగా చల్లకూడదన్నారు. అనంతరం ఘన జీవామృతం గురించి రైతులకు అవగాహన కల్పించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని ఎఒ దేవి పద్మలత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. వరి సాగును పరిశీలించారు. సాధ్యమైనంతవరకు యూరియా వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాగు చేసిన ప్రతి పంటను రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ స్వప్న, విఎఎ సాయితేజ, పార్లమెంట్ మైనార్టీ కార్యదర్శి అక్బర్ సలీం, బత్తల కిరణ్‌బాబు, మంగపట్నం పెద్ద సుబ్బరాయుడు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎఒ దేవి పద్మలత

దోమల నివారణతోనే వ్యాధులు దూరం

ప్రజాశక్తి - చాపాడు

దోమల నివారణతోనే పలు వ్యాధులకు దూరంగా ఉండవచ్చని నక్కలదిన్నె ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కావ్య మాధురి తెలిపారు. నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గ్రామాలలో బుధవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియాపై పోరాటాన్ని వేగవంతం చేయడం అనే నినాదంతో ఆరోగ్య సంస్థ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. పాఠ శాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరో గ్య విస్తరణ అధికారి ఎం.రాఘవయ్య, సూపర్వై జర్ ప్రసాద్, భవాని, ఎంఎల్‌హెచ్‌పి కీర్తి, ఏఎన్ ఎంలు శోభారాణి, ఆరోగ్య మేరీ, ఆశా కార్యకర్తలు పోతులూరమ్మ, సావిత్రీ, విద్యార్థులు పాల్గొన్నారు. **వేంపల్లె :** దోమల ద్వారా మలేరియా వంటి వ్యా ధులు వ్యాపిస్తాయని డాక్టర్ సుభాషిణి తెలిపారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా తాళ్ల పల్లె పిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ ర్యాలీ నిర్వహించారు. వైద్యులు నిహారిక, శాంతి, సి హెచ్ఒ వెంకటరత్నం, డి ప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీవున్నిసా బేగం, ఎంపిహెచ్ఇఒ ఫక్రుద్దీన్, సూపర్‌వైజర్ అంకయ్య, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. **ముద్దనూరు :** దోమ కాటుకు గురికాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిహెచ్ సి వైద్యాధికారి కరిష్మా తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం కరిష్మా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, ఆరోగ్య పర్య వేక్షకులు రామారావు, జయమ్మ, ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ సూర్యకుమారి, ల్యాబ్ టెక్నీషి యన్ జాసన్, ఫార్మా సిస్ట్ జగదీష్, హెల్త్ అసిస్టెంట్ జయాకర్, సుకన్య పాల్గొన్నారు. **వేముల :** ప్రపంచ దోమల దినోత్సవం సం దర్భంగా బుధవారం వేముల పిహెచ్‌సి సిబ్బంది ఆధ్వర్యంలో ఎంపీపీ పాఠశాలను, అంగన్వాడీ కేంద్రం-1, కేజీబీవీ పాఠశాలను సందర్శించి పిల్లలు, తల్లులకు అవగాహన కల్పిస్తూ, ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఉషారాణి, హెల్త్ సూపర్వైజర్ రమేష్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఏఎన్ ఎం నీరజ, ఆశ కార్యకర్తలు శివపార్వతి పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** మలేరియాపై పోరాటాన్ని వేగ వంతం చేయాలని వైద్యులు పిలుపునిచ్చారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా యుపి ఎస్‌సి శ్రీనివాసనగర్ పరిధిలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మధుకుమార్, డాక్టర్ మోహన్‌కాంత్ మాట్లా డుతూ మలేరియాకు కారణం ప్లాస్మో డియం జాతికి చెందిన ప్రోటోజోవన్ పరాన్నజీవి అన్నా రు. ఇది అనాఫిలిస్ అనే ఆడదోమ జాతికి చెంది నదని పేర్కొన్నారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా బుధవారం బాకరాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మహాత్మా జ్యోతి బాపూలే ఆంధ్రప్రదేశ్ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో వైద్యాధికారి డాక్టర్ శాంతి కుమార్, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో బాలికలకు దోమల కాటుతో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆరోగ్య కార్యకర్తలు సోమ లింగారెడ్డి, శేషగిరి నాయక్, లక్ష్మీదేవి, ప్రేమలత, ఆశా కార్యకర్త సావిత్రి, స్టాఫ్‌నర్స్ సుష్మా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **కడప అర్బన్ :** దోమల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు మలేరియా జోనల్ అధికారి డాక్టర్ జమాల్ బాషా పేర్కొన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి బాబు ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ ఛాంబర్‌లో జిల్లా మలేరియా అధికారి, ప్రోగ్రాం ఆఫీసర్స్, వైద్య సిబ్బందితో అవగాహన సమావేశం నిర్వ హించారు. డాక్టర్ జమాల్ బాషా సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. జిల్లా మలేరియా అధికారి మనోరమ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శశి భూషణ్ రెడ్డి, ఎన్‌సిడి. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకట చంద్రారెడ్డి, డెమో భారతి, ఎఎంఒ వెంకటరెడ్డి, డిప్యూటీ డెమో రమణమ్మ, సిహెచ్ఒ మునిరెడ్డి, ఎపెడమిక్ సెక్షన్, మలేరియా కార్యాలయ, జోనల్ మలేరియా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. **బద్వేలు :** దోమలను నియంత్రించినప్పుడే సంపూర్ణ ఆరోగ్యమని సబ్ యూనిట్ అధికారి టి. నరసింహారెడ్డి పేర్కొన్నారు. జడ్‌పి బాలుర పాఠశాల, డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ గురుకులం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. వైద్యాధికారి శరత్‌చంద్ర, హెచ్‌ఎం గాజులపల్లి వెంకటసుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ భానుమతి, సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు జనార్ధన్‌రావు, శ్రీరామయ్య, వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలి

వినతిపత్రం ఇస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రభుత్వాసుపత్రి పారిశుధ్య కార్మికులకు బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఆసుపత్రి కార్మిక సంఘ గౌరవ అధ్యక్షులు (సిఐటియు అనుబంధం) రాఘవ కోరారు. వేతనాలు చెల్లించక పోవడానికి నిరసనగా బుధవారం కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రాఘవ మాట్లాడుతూ 60 మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వీరికి రెండు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.21,000 ఇవ్వాలన్నారు. కార్మికులందరికీ సంవత్సరానికి రెండు జతలు యూనిఫామ్ ఇవ్వాలని కోరారు. ఆ మేరకు సూపరిం టెండెంట్ రూపానంద్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షులు రత్తమ్మ, ప్రధాన కార్యదర్శి కళావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహులు, సహాయ కార్యదర్శి గంగాధర్, కోశాధికారి మహేష్, కమిటీ సభ్యులు దస్తగిరి, నరసింహులు, ప్రసాద్, రాణి, లక్ష్మీ, చెన్నమ్మ, మరియమ్మ, జ్యోతక్క, కార్మికులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

టిడిపి జెండా దిమ్మెను తక్షణమే తొలగించాలి

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

మైదుకూరు బస్టాండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ కూడలిలో అక్రమంగా నిర్మిస్తున్న తెలుగుదేశం పార్టీ జెండా దిమ్మె, స్తంభాలను తక్షణమే తొలగించాలని పలు ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. అక్రమ కట్టడాల తొలగింపు కోసం పలుమార్లు విన్నవించినా మున్సిపల్ కమిషనర్ స్పందించకపోవడంతో బుధవారం ఆగ్రహించిన ప్రజా సంఘాల నేతలు మరోసారి వినతిపత్రాన్ని అందజేశారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి, వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌సి సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు విలియమ్ కలమలమిట్ట, సీపీఐ నాయకులు శ్రీరాములు, మాలమహానాడు నాయకులు వసంత్‌కుమార్, ఎంఆర్‌పీఎస్ నాయకులు కైపు భాస్కర్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమని ఆరోపించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అగౌరవపరచడమేనని పేర్కొన్నారు. అక్రమ కట్టడాలను వెంటనే తొలగించకపోతే భారీ ఎత్తున ధర్నాలు, రాస్తారోకో నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు కనకరాజు, సీపీఐ నాయకులు భాస్కర్, పీరయ్య, మాలమహానాడు నాయకులు కుమార్, ఓబులేసు, ఐతబాబు, ఎంఆర్‌పీఎస్ నాయకులు నాగార్జున, రమణ, విజయరాణి, పలువురు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సొసైటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - చాపాడు

మార్తల నరసింహారెడ్డి

అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘం సొసైటీ చైర్మన్‌గా సీతారామాపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు మార్తల నరసింహారెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం చేపట్టనున్నారు. అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానం ఆవరణలోని టీటీడీ కల్యాణ మండపంలో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరుకానున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. చైర్మన్‌తోపాటు మెంబర్‌లుగా నెర్రవాడకు చెందిన మేకల సుదర్శన్, అల్లాడుపల్లెకు చెందిన గోసుల చిన్న వీరయ్యగారి వీరారెడ్డి(గుండు వీరయ్య) ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సొసైటీ అధికారులు ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేపట్టారు.

పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు పట్టణంలో ప్రజల సౌకర్యం కోసం పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, రవి కోరారు. ఆ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైదుకూరు రాయలసీమ నడిబొడ్డులో ఉన్న ప్రధాన కూడలి కేంద్రం అన్నారు. మండల పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు నిత్యం తమ అవసరాల కోసం మైదుకూరుకు వస్తుంటారన్నారు. పబ్లిక్ టాయిలెట్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. గతంలో పోస్ట్ ఆఫీస్ కార్యాలయం దగ్గర మరుగుదొడ్లు ఉండేవని, కొన్ని కారణాలతో వాటిని తొలగించారన్నారు. వాటి స్థానంలో తిరిగి ఎక్కడ కూడా నిర్మించలేదని గుర్తు చేశారు. కేవలం ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న మరుగుదొడ్లే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మహిళలు, షుగర్ పేషంట్స్ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి మరుగుదొడ్లు నిర్మించాలని వారు కోరారు.

రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

రాజీవ్ గాంధీ గొప్ప దార్శనికుడు : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

భారతరత్న, భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ గొప్ప దార్శనికుడు, రాజనీతిజ్ఞుడు అని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి కొనియాడారు. బుధవారం వేంపల్లెలో రాజీవ్ గాంధీ 81వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ యువతను ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామ్యం చేసిన యువత పక్షపాతి రాజీవ్‌గాంధీ అన్నారు. స్థానిక ప్రభుత్వాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి మహిళా సాధికారతకు కృషి చేసిన మహిళ పక్షపాతి రాజీవ్‌గాంధీ అన్నారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం, అనుసరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రమణ్యం, పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ధృవకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, ఐచర్ రమణ, వినయ్, సాయి , రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షులు కుంచం వెంకటసుబ్బారెడ్డి, కృష్ణ, సాధక్ వల్లి, ఖాసీం పాల్గొన్నారు.

కడప : భారతదేశంలో గ్రామీణ భారతాన్ని అద్భుతంగా సృష్టించి అభివృద్ధి చేసిన మహానేత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ కొనియాడారు. కడపలోని ముస్లిం అనాథ శరణాలయంలో రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రహమతుల్లా ఖాన్ ఆధ్వర్యంలో అక్కడి విద్యార్థులకు ,అనాథలకు పండ్లు, కేకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌ఛార్జి హమీద్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమల్ బాషా పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పంపిణీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పదవ తరగతి చదువుతున్న ప్రతిభ గల పదిమంది విద్యార్థులకు రూ.25 వేలు నగదు బయోస్టాడ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ సీనియర్ సేల్స్ మేనేజర్ జనార్ధన్‌రెడ్డి పంపిణీ చేశారు. పెద్ద ముడియం మండల పరిధిలోని పెద్ద పసుపల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు జరీనా విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జనార్ధన్‌రెడ్డి మాట్లా డుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సాహించాలనే సంక ల్పంతో తమ కంపెనీ విద్యార్థులకు ఉపకార వేతనాలుగా కొంత నగదు రూ పంలో అందజేస్తున్నామని వివరించారు. ప్రతి ఏడాది జిల్లాలో నాలుగు పాఠ శాలలను ఎంపిక చేసుకొని విద్యార్థులకు ఉపకారవేతనాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ పాఠశాల నుండి ఈ ఏడాది 10 మంది విద్యా ర్థులను ఎంపిక చేసి ఒక్కొక్కరికీ రూ.2,500 చొప్పున ఇచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు జరీనా బేగం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు నగదును పంపిణీ చేసినందుకు పాఠశాల, విద్యార్థుల తల్లిదండ్రుల తరుపున అభినందనలు తెలిపారు. వీరి ప్రోత్సాహంతో బాగా చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అడ్వైజర్లు సుధాకర్‌రెడ్డి, వీరభద్రుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదును పంపిణీ చేస్తున్న జనార్దన్‌రెడ్డి